క్లుప్తంగా

విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మహేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సీడ్ విత్తనాలను ఎంఆర్‌పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం పట్టణంలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాక్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పత్తి, మిరప, ఉల్లితో పాటు ఇతర సీడ్ విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు విక్రయించేటప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన వలమన్న

ఆదోని అర్బన్: మండలంలోని దిబ్బనకల్ గ్రామానికి చెందిన వలమన్న శుక్రవారం నెట్టేకల్ క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వలమన్న సొంత పని నిమిత్తం బైక్‌పై గ్రామం నుంచి ఆదోనికి వస్తుండగా కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. అక్కడున్న వారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆదోని టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న భజన మండలి సంఘం అధ్యక్షుడు తిక్కన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న 17వ వార్డు ఇన్‌చార్జి తాయన్న, కౌన్సిలర్ శాంతమ్మ ఆధ్వర్యంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అంబేడ్కర్ సొసైటీ డైరెక్టర్ కుంకనూరు వీరేష్, తిక్కన్న రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ తిరిగిరాని లోకాలకు చేరిన తిక్కన్న అంత్యక్రియలకు మానవతా దృక్పథంతో సాయం అందించినట్లు వారు పేర్కొన్నారు. రామకృష్ణ, బేల్దారి ఆంజి, నవీన్, నరేష్‌కుమార్, వీరయ్య తమవంతుగా సహాయ సహకారాలు అందించారు. రామకృష్ణ, జయమ్మ, వెంకటేష్, మాలమహానాడు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు పరిశీలన



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈ

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మిగనూరు రోడ్డులో ఏర్పాటు చేసిన కంపోస్టు యార్డును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డీఈ నాగభూషణం పరిశీలించారు. కంపోస్టు యార్డులో రోజులో ఏ మేరకు చెత్త స్టోరేజీ అవుతుంది, స్టోరేజీ అయిన చెత్తను ఏ స్థాయిలో కాంపోస్టు ఎరువు తయారు చేస్తున్నారన్న విషయాలపై కింది స్థాయి అధికారులతో చర్చించారు. తయారైన ఎరువును రైతులకే విక్రయించాలన్న నిబంధన పాటించాలని సూచించారు. ఎమ్మిగనూరు రోడ్డు, సిరుగుప్ప చెక్‌పోస్టు ఏరియాలో కాంపోస్టు యార్డులలో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నామని, ఎరువును పంట పొలాలకు ఉపయోగించి రైతులు మంచి పంటలు పండించవచ్చని కమిషనర్ సూచించారు.

ఏపీ సెట్‌లో ప్రతిభ



వి.జనార్ధన రెడ్డి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణానికి చెందిన వీవీ సుబ్బారెడ్డి, పద్మావతమ్మల కుమారుడు జనార్ధన రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎలిజబుల్ టెస్ట్ పరీక్షల్లో అర్హత సాధించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో పేపర్-1, పేపర్-2 లో ఆయన 44.67 పర్సంటేజ్ పొందారు. ఈ అర్హతతో డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుడిగానూ, విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వెళ్లే అవకాశాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తండ్రి రిటైర్డ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ కాగా తల్లి గృహిణిగా ఉన్నారు.

సురక్షతో మెరుగైన వైద్యసేవలు

కౌతాళం: సురక్షతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వైద్యాధికారిణి పావని, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అన్నారు. కౌతాళంలో ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక ఎస్‌డబ్ల్యూ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. రోగులు అధికంగా తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. హైపర్‌టెన్షన్, డయాబెటిస్, హిమోగ్లోబిన్, మలేరియా, టీబీ, డెంగ్యూ, యూరిన్ టెస్ట్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్, ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యదర్శి శివప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు శుభశకునం

- ఖరీఫ్‌కు ముందే విత్తన పంపిణీపై హర్షం
- వర్షాల పలకరింపు, పంట నష్టపరిహారం మంజూరుతో ఉత్సాహం
- ఆదోని మండలానికి 1010 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు మంజూరు
- ఆర్‌బీకేల ద్వారా గ్రామాల్లోనే రైతులకు పంపిణీ



బల్లేకల్ రైతు భరోసా కేంద్రంలో వేరుశనగకాయల బస్తాలను తీసుకుంటున్న రైతులు

ఆదోని రూరల్: ఓ వైపు వరుణుడు కరుణించాడు. మరోవైపు ప్రభుత్వం అండగా నిలిచింది. వర్షాలు కురవడంతో పొలాలను దుక్కిదున్నుకుంటున్నారు రైతన్నలు. అలాగే ఎన్నికల ముందు నిలిచిపోయిన పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. జూన్ నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా ఖరీఫ్ సీజన్‌కు ముందే ఈనెల 20వ తేదీ నుంచి వ్యవసాయాధికారులు విత్తన పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో రైతులకు ఈ యేడాది అంతా కలిసి రానుంది. వర్షం రాకతో మురిసిపోయిన రైతన్నకు పంట పెట్టుబడులకు పంట నష్టపరిహారం అందడం, సబ్సిడీ ధరకే విత్తనాలు అందుతుండడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఆదోని మండలంలో 23,933 మంది రైతులు ఉన్నారు. ఏటా 20,496 హెక్టార్లలో రైతులు వేరుశనగ, పత్తి, జొన్న, ఆముదం, సన్‌ఫ్లవర్ తదితర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆదోని మండలానికి 1010 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగకాయలు మంజూరయ్యాయి. ఇందులో 770 క్వింటాళ్ల కే-6 రకం, 160 క్వింటాళ్ల టీసీజీఎస్ 1694 రకం, 130 క్వింటాళ్ల కదిరి లేపాక్షి రకం సబ్సిడీ వేరుశనగకాయలు ఉన్నాయి.

స్థానికంగానే విత్తన పంపిణీ

మండలంలోని ఆయా ఆర్‌బీకేల ద్వారా రైతులకు సబ్సిడీ వేరుశనగకాయలు పంపిణీ చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రానికి వెళ్లి ఎన్నో వ్యయప్రసాయాలకు ఓర్చి విత్తనాలు పొందాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు సంబరపడుతున్నారు.

మండలంలోని బల్లేకల్, బసరకోడు, బైచిగేరి, చిన్నపెండేకల్, దిబ్బనకల్, దొడ్డనకేరి, జి.హొసళ్లి, గణేకల్, జాలిమంచి, కపటి, కుప్పగల్, మాంత్రికి, నాగలాపురం, పెసలబండ, పెద్దతుంబళం, సాదాపురం, సాంబగల్, విరుపాపురం తదిరత గ్రామాల్లో సబ్సిడీ వేరుశనగకాయల పంపిణీ జోరుగా సాగుతోంది. ఇప్పటివరకు 862 క్వింటాళ్ల వేరుశనగ కాయల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాగే మండలానికి 160 క్వింటాళ్ల కంది విత్తనాలు, 5 క్వింటాళ్ల జీలుగ, 1.5 క్వింటాళ్ల పిల్లిపెసర మంజూరయ్యాయి. ఇంకా 1500 క్వింటాళ్ల వేరుశనగకాయలు అదనంగా అవసరవుతాయని వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపారు.

వేరుశనగ కే-6 రకం, టీసీజీఎస్-1694 ధరల వివరాలు

బస్తా (30 కేజీలు)	పూర్తి ధర	సబ్సిడీ ధర	నికర ధర
1	రూ.2850	రూ.1140	రూ.1710
2	రూ.5700	రూ.2280	రూ.3420
3	రూ.8550	రూ.3420	రూ.5130

వేరుశనగ కదిరి లేపాక్షి రకం ధరల వివరాలు

బస్తా (30 కేజీలు)	పూర్తి ధర	సబ్సిడీ ధర	నికర ధర
1	రూ.2610	రూ.1044	రూ.1566
2	రూ.5220	రూ.2088	రూ.3132
3	రూ.7830	రూ.3132	రూ.4698

గ్రీన్ మనూర్ సీడ్ ధర వివరాలు

విత్తనం	కేజీలలో	పూర్తి ధర	సబ్సిడీ ధర	నికర ధర
జీలుగ	10	రూ.880	రూ.440	రూ.440
జనుము	10	రూ.880	రూ.440	రూ.440
పిల్లిపెసర	8	రూ.1072	రూ.536	రూ.536

విత్తన కొరత లేకుండా చర్యలు



రైతులకు విత్తన కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మండలానికి 1010 క్వింటాళ్ల వేరుశనగ, 160 క్వింటాళ్ల కంది విత్తనాలు, 5 క్వింటాళ్ల జీలుగ, 1.5 క్వింటాళ్ల పిల్లి పెసర మంజూరయ్యాయి. ఇంకా 1500 క్వింటాళ్ల వేరుశనగకాయలు అదనంగా అవసరవుతాయని జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఆర్‌బీకేల ద్వారా విత్తనాల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. అర్హులైన ప్రతిరైతుకు సబ్సిడీ విత్తనాలను అందిస్తాం. – **అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఓ, ఆదోని**

సంతోషంగా ఉంది



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే పంట నష్టపరిహారం అందడం, సబ్సిడీ వేరుశనగకాయలు, జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలు అందించడం చాలా సంతోషంగా ఉంది. వర్షాలు కూడా ముందస్తుగానే వచ్చాయి. నాకున్న మూడు ఎకరాల్లో ఏటా పత్తి, వేరుశనగ, పిల్లి పెసర పంటలను వేసేవాడిని. ఈ యేడాది కురిసిన వర్షాలకు పొలాన్ని దుక్కి దున్నుకున్నాను. మరొక వర్షం వస్తే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నా.

– **వీరన్న, రైతు, కుప్పగల్ గ్రామం**

సబ్సిడీ విత్తనాలను తీసుకున్నా



ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను సీజన్‌కు ముందుగానే అందించడం చాలా సంతోషంగా ఉంది. నాకు గ్రామంలో రెండెకరాల పొలం ఉంది. ఏటా ఒక ఎకరాలో పత్తి, మరో ఎకరాలో వేరుశనగ సాగుచేస్తాను. నాకు ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం డబ్బులు కూడా అందాయి. ముందుగానే వేరుశనగకాయలను అందించడం సంతోషంగా ఉంది. పంట పొలాన్ని దుక్కి దున్నుకుని సాగుకు సిద్ధంగా ఉన్నాను. – **సరస్వతి, మహిళా రైతు, బల్లేకల్**

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ఆదోని అర్బన్: మానసిక ప్రవర్తనలో మార్పులు ఉంటే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలని డాక్టర్ చైతన్యకుమార్ సూచించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం 'ప్రపంచ స్కిజోఫ్రీనియా డే' సందర్భంగా మానసిక ఆరోగ్య కార్యక్రమంపై సైకియాట్రి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిజోఫీనియాతో బాధపడే వారిలో తనలో తానే మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, అనుమానం, భ్రమ, భ్రాంతి, అసాధారణ ప్రవర్తన, నిద్ర లేకపోవడం, మాటల్లో స్పష్టత లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలను సరైన సమయంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయం చేసి సాధార స్థితికి తీసుకురావొచ్చన్నారు. అనంతరం డాక్టర్ సృజన మాట్లాడుతూ మానసిక వ్యాధులతో బాధపడే వారికి కుటుంబ సభ్యులు ఆదరణ చూపించి మనోధైర్యం కల్పించడం ముఖ్యమని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్, వైద్య సిబ్బంది మహేశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సోమశేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల సంక్షేమమే లియాఫి ధ్యేయం



లియాఫి మ్యాగజైన్ ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమమే లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫి) ధ్యేయమని ఆ సంఘ డివిజన్ అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో సంఘ బ్రాంచ్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో లియాఫి 1964 హౌస్ మ్యాగజైన్‌ను సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. లియాఫి ఏజెంట్ల సంక్షేమానికి పలు అంశాల్లో సాధించిన విజయాలతో పాటు గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచడం జరిగిందని వివరించారు. ఇందులో భాగంగా ఆలిండియా సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆలిండియా మాజీ ఈసీ మెంబర్ రమేష్, జోనల్ ఈసీ సభ్యులు రంగస్వామి, డివిజన్ ఉపాధ్యక్షులు ఆంధ్రయ్య, డివిజన్ నాయకులు జయరాం, హరినాథ్, బ్రాంచ్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి శివరాముడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

27 నుంచి పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఆదోని సెంట్రల్: పాలిసెట్-24 (పాలిటెక్నిక్)లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీ నుంచి ఆదోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు హెచ్‌టిటిపిఎస్//ఎపిపిఓఎల్‌సిఈటి.ఎన్ఐసి.ఇన్ అనే వెబ్‌సైట్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700 ఫీజు చెల్లించాలన్నారు. ఫీజు చెల్లించిన విద్యార్థుల విద్యార్హత ధ్రువ పత్రాలను పరిశీలన జూన్ 3వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు కళాశాల ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని, 5 నుంచి 7వ తేదీ వరకు ఆప్షన్స్ మార్చుకునే అవకాశం, 7వ తేదీ నుంచి కళాశాలల కేటాయింపు జరుగుతుందని వివరించారు. ఎస్టీ అభ్యర్థులకు ధ్రువ పత్రాల పరిశీలన కర్నూలు, బి.తాండ్రపాడులోని ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోనూ, స్పెషల్ కేటగిరీ (పీహెచ్, క్యాప్ స్పోర్ట్స్) వారికి ధ్రువపత్రాల పరిశీలన విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతుందన్నారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరుకావాలని సూచించారు

ధ్రువ పత్రాల పరిశీలన వివరాలు

తేదీ	ర్యాంకులు
27	1 నుంచి 12 వేల వరకు
28	2,001 నుంచి 27 వేల వరకు
29	27,001 నుంచి 43 వేల వరకు
30	43,001 నుంచి 59 వేల వరకు
31	59,001 నుంచి 75 వేల వరకు
జూన్ 1	75,001 నుంచి 92 వేల వరకు
జూన్ 2	92,001 నుంచి 1,08,000 వేల వరకు
జూన్ 3	1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు

పెద్దతుంబళంలో కార్డెన్ సెర్చ్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో శుక్రవారం ఆదోని రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, పెద్దతుంబళం, ఇస్వీ, ఆదోని రూరల్ ఎస్ఐలు చిన్నపీరయ్య, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, పోలీసులతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కర్ణాటక మద్యం అమ్మేవారి ఇళ్లు, రౌడీషీటర్స్, సస్పెక్ట్ వ్యక్తుల ఇళ్లను తనిఖీ చేసి హెచ్చరికలు జారీ చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామ వీధుల్లో సిబ్బందితో కవాతు నిర్వహించారు. ముఖ్యమైన కూడళ్లలో మీటింగ్‌లు ఏర్పాటు చేసి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామంలో ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో అమ్మరాదని సూచించారు. వాహనాల తనిఖీ చేపట్టగా పత్తికొండకు చెందిన రామకృష్ణ బైక్‌పై 96 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడడంతో అతనిపై కేసు నమోదు చేశారు. రికార్డులు సరిగా లేని 12 బైక్‌లను సీజ్ చేశారు.



రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వైభవంగా ప్రభోత్సవం



సీతారాముల ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం కడపాళెం వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల తిరుగు పెళ్లి మహోత్సవం శుక్రవారం సాయంత్రం కమనీయంగా సాగింది. సాయంత్రం ఆలయం నుంచి సీతారామాంజనేయ స్వామి విగ్రహాలను పల్లకీలో కొలువుంచి వేదపండితులు మంత్రాలను పఠిస్తుండగా మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో తేరుబజారు మైదానం వరకు తీసుకొచ్చారు. ప్రభపై కొలువుంచి రథశాల నుంచి స్వామి వారి పాదాల చెంత వరకు ఊరేగించి తిరిగి గమ్యస్థానానికి చేర్చారు. తర్వాత సీతమ్మ కల్యాణ కట్టపై సీతారాముల తిరుగు పెళ్లి మహోత్సవం నిర్వహించారు. అక్కడినుంచి ఆలయం చెంతకు చేర్చి ఉత్సవాలకు ముగింపు పలికారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు



గంధంను తీసుకువస్తున్న పీఠాధిపతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరా సాహెబ్ స్వాముల ఉరుసు మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పీఠాధిపతి గురు ఘాజీ హుసేన్‌సాహెబ్, కుమారులు సయ్యద్‌ఖాలీద్ సైఫుల్లా, సయ్యద్‌హమీద్ హుసేన్‌లతో కలసి గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు స్వాముల ప్రవచనాలను వినిపించగా భక్తులు శ్రద్ధగా విన్నారు. ఉదయం పీఠాధిపతి దర్గా ట్రస్ట్ ప్రెసిడెంట్ గురు హాజీ హుసేన్‌సాహెబ్ పీరా స్వాముల ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా గ్రామ పురవీధుల గుండా భక్తుల హర్షధ్వానాల మధ్య దర్గాకు తీసుకొచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు.రూరల్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి బందోబస్త్ చేపట్టారు.

గాలీవాన బీభత్సం

గోనెగండ్ల: అల్పపీడనం ప్రభావం వల్ల గోనెగండ్ల మండలంలో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం 6:30 గంటల నుంచి గాలీవాన, భారీగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మండలంలో అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పుట్టపాశం గ్రామంలో కర్నూలు - ఎమ్మిగనూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న ఆరు విద్యుత్ స్తంభాలు రోడ్డుపై నెలకొరిగాయి. దీంతో ఆ మార్గంలో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు స్తంభాలను జేసీబీ సాయంతో తొలగించారు. అనంతరం వాహనాల రాకపోకలు కొనసాగాయి. మండలంలో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాటు వీధులన్నీ జలమయమయ్యాయి.

క్రేన్ విరిగిపడి ముగ్గురికి గాయాలు

పెద్దనేలటూరు గ్రామంలో గ్రీన్‌కో విండ్ పవర్ వద్ద క్రేన్ విరిగిపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం వర్షం కురవడంతో అక్కడ పని చేస్తున్న ముగ్గురు సిబ్బంది బొలెరో వాహనంలో కూర్చున్నారు. ఉధృతంగా వీచిన గాలులకు క్రేన్ విరిగి బొలెరో వాహనంపై పడింది. వాహనంలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కోసిగికి చేరిన పాఠ్యపుస్తకాలు



కోసిగి: 2024-2025 విద్యా సంవత్సరానికి గానూ పాఠ్యపుస్తకాలు శుక్రవారం కోసిగికి చేరాయి. మొదటి విడతగా ఆర్టీసీ బస్సులో 19,441 పాఠ్య పుస్తకాలు, 19,141 నోటు పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ నాగేశప్ప తెలిపారు. వాటిని బాలుర ఉన్నత పాఠశాలలో భద్రపరిచినట్లు చెప్పారు. జూన్ 12వ తేదీ పాఠశాలలు తెరిచేలోగా వివిధ పాఠశాలలకు చేరుస్తామని వెల్లడించారు.

నిత్య సహాయమాత ఊరేగింపు



పెద్దకడబూరు: మండల కేంద్రంలో శుక్రవారం ఆర్సీఎం చర్చ్ ఫాదర్ ఆధ్వర్యంలో నిత్య సహాయమాత వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. సాయంత్రం నిత్య సహాయమాత విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో అధిష్టించి క్రైస్తవ భక్తిగీతాలతో పురవీధులగుండా ఊరేగించారు. అనంతరం ఆర్సీఎం చర్చి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అతిథిగా పగడాల చిన్నపరెడ్డి, చర్చి ఫాదర్లు జార్జ్, రాజ్‌కుమార్, కరుణాకర్, జ్ఞానప్రకాశం, రామన్న, ఆశన్న, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


డాక్టరేట్ ప్రదానం



గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న వీరన్న

గోనెగండ్ల: మండల పరిధిలోని అలువాల గ్రామానికి చెందిన కురువ చిన్న వీరన్న 'ఫిమేల్ చైల్డ్ లేబర్స్'పై చేసిన పరిశోధనకు విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఆయన డాక్టరేట్ పట్టా పొందారు. వీరన్న గతంలో అదే వర్సిటీలో సోషల్ వర్క్ విభాగంలో రెండేళ్ల కోర్సును అభ్యసించి ప్రథమ స్థానాన్ని పొందడంతో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా స్వర్ణ పతకం అందుకున్నారు. ప్రస్తుతం ఆయన డాక్టరేట్ పొందడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినంధించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లం ద్రావణాన్ని పారబోస్తున్న పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామ కొండల్లో ఆదోని పట్టణం వాల్మీకి నగర్‌కు చెందిన బోయ ఉదయ్ అనే వ్యక్తి నాటు సారా కాస్తుండగా పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. నిందితుడు ఉదయ్ పోలీసులను చూసి తప్పించుకుని పారిపోయాడన్నారు. నాటుసారా స్థావరంలోని 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు. ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హోరాహోరీగా గిరకబండి పోటీలు



గిరక బండిని లాగుతున్న వృషభాలు

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నకడబూరు ఆంజనేయస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన గిరక బండి పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో 8 జతల ఎద్దులు పాల్గొనగా చింతకుంట గ్రామానికి చెందిన నాగేష్ వృషభాలు నిర్ణీత సమయంలో గిరకబండిని 3100 మీటర్ల దూరం లాగి విజేతగా నిలిచాయి. అలాగే చింతకుంట హనుమంతు వృషభాలు 2997 మీటర్లు, కలిగెట్ల వీరాంజనేయులు వృషభాలు 2990 మీటర్లు లాగాయి. వీరికి వరుసగా రూ.11 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు చొప్పున మొదటి, రెండు, మూడవ బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, సర్పంచ్ అనసూయమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. నం.:72
(APMACS చట్టం, 1995 క్రింద నమోదు కాబడినది) RBI లైసెన్స్ నం: UBD, AP, 1671P
email id: ho@avvabank.com. Coustomer Care Cell: 81259 10943, Ph: 08512-252922

Ref No.SMLC.BANK; ADN;2024-25 DATE: 20.05.2025
MTL: 200230141000034 Regd post a/d

స్వాధీనత ప్రకటన (లాంఛనప్రాయం మాత్రమే)
రూల్8(1)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు Ref.No. SMLC.BANK;ADN;2023-24 తేది: 12-03-2024 క్రింద డిమాండ్ నోటీస్ జారీ చేసి **రుణగ్రహీతలు: 1. షేక్‌షావలి తండ్రి ఎ.అబ్దుల్ సాహెబ్ (2) ఎ.షాషావలి తండ్రి ఎ.అబ్దుల్ సాహెబ్, ఇ.నం. 23-352-1, కార్వాన్ పేట్, ఆదోని వారిని సదరు నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తం 02-03-2024 వరకు రూ. 3,17,428/- (మూడు లక్షల పదిహేడు వేల నాలుగు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే)** (03.03.2024 నుండి చార్జ్ చేయబోయే/చెల్లించవలసిన వడ్డీ మరియు ఇతర చార్జీలు) తిరిగి చెల్లించాల్సిందిగా కోరారు. **17.05.2024 నాటికి రూ. 2,94,479/- (రెండు లక్షల తొంభై నాలుగు వేల నాలుగు వందల డెబ్బై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మాత్రమే డెబిట్ బ్యాలెన్స్ ఉన్నది. రుణగ్రహీత సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్‌తో సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని 20 మే 2024న వాస్తవ స్వాధీనం కాకుండా నామమాత్ర లాంఛనప్రాయ స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందు మూలంగా తెలియజేయడమైనది. సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తిలో జరిపే ఏ వ్యవహారములైనా **17.05.2024 నాటికి బకాయి ఉన్న రూ. 2,94,479/- (రెండు లక్షల తొంభై నాలుగు వేల నాలుగు వందల డెబ్బై తొమ్మిది రూపాయలు మాత్రమే).** (18.05.2024 నుండి చార్జ్ చేయబోయే/చెల్లించవలసిన వడ్డీ మరియు ఇతర ఛార్జీలు) మొత్తము కొరకు శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని యొక్క ఛార్జ్‌కు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

షెడ్యూలు-సి : ఆస్తి వివరణ (డాక్యుమెంట్ నెం. 8051 ఆఫ్ 2009) : రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు మరియు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా ఆదోని, ఆదోని మున్సిపాలిటీ పరిధిలో కార్వాన్‌పేట్‌లో గల ప్రస్తుత వార్డ్ నం. 23, డోర్ నం. 352-1 కలిగిన ఇంటి ఆస్తి యావత్తు. **సరిహద్దులు: తూర్పు:** సూర్జాన్ బేగం ఇల్లు మరియు ఖాళీ ప్రదేశం, **పశ్చిమం:** చాంద్ భాషా ఇల్లు, **ఉత్తరం:** సూర్జాన్ బేగం ఇల్లు మరియు శేషప్ప ఇల్లు, **దక్షిణం:** జయమ్మ ఇల్లు మరియు రస్తా. **కొలతలు: తూర్పు-పశ్చిమం:** 45 అడుగులు లేదా 13.92 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం:** $16^{3/4}$ అడుగులు లేదా 5.11 మీటర్లు. **మొత్తం విస్తీర్ణం:** $83^{3/4}$ చ.గజాలు. **నిర్మించిన విస్తీర్ణం: తూర్పు-పశ్చిమం: 11 అడుగులు x $16^{3/4}$**

సం/- **అధీకృత అధికారి**

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. నం.:72
(APMACS చట్టం, 1995 క్రింద నమోదు కాబడినది) RBI లైసెన్స్ నం: UBD, AP, 1671P
email id: ho@avvabank.com. Coustomer Care Cell: 81259 10943, Ph: 08512-252922

Ref No.SMLC.BANK; ADN;2024-25 DATE: 20.05.2025
OD: 200260011000165 Regd post a/d

స్వాధీనత ప్రకటన (లాంఛనప్రాయం మాత్రమే)
రూల్8(1)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు Ref.No. SMLC.BANK;ADN;2023-24 తేది: 12-03-2024 క్రింద డిమాండ్ నోటీస్ జారీ చేసి **రుణగ్రహీత/ఆస్తి యజమాని: (1) M/s. శివగంగ ట్రేడర్స్, ప్రొప్రయిటర్: పి.ముత్తురెడ్డి, వార్డ్ నం. 6-1-1, కోసిగి, గ్యారంటార్/ఆస్తి యజమాని: పి.లక్ష్మి అలియాస్ అలమ్మ భర్త పి.ముత్తురెడ్డి, ఇ.నం. 2/522, మండిగిరి పోస్టల్ కాలనీ, ఆదోని** వారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన **మొత్తం 22-02-2024 వరకు రూ. 10,15,955/- (పది లక్షల పదిహేను వేల తొమ్మిది వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే)** (23-02-2024 నుండి ఛార్జ్ చేయబోయే/ చెల్లించవలసిన వడ్డీ మరియు ఇతర ఛార్జీలు) తిరిగి చెల్లించవలసిందిగా కోరారు. **17.05.2024 నాటికి రూ. 10,49,363/- (పది లక్షల నలభై తొమ్మిది వేల మూడు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే).** డెబిట్ బ్యాలెన్స్ ఉన్నది. రుణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్‌తో సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని 20 మే 2024న వాస్తవ స్వాధీనం కాకుండా నామమాత్ర లాంఛనప్రాయ స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు /గ్యారంటార్ల కు మరియు సాధారణ ప్రజలకు ఇందు మూలంగా తెలియజేయడమైనది. సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **రూ. 10,49,363/- (పది లక్షల నలభై తొమ్మిది వేల మూడు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే).** (18.05.2024 నుండి చార్జ్ చేయబోయే/చెల్లించవలసిన వడ్డీ మరియు ఇతర ఛార్జీలు) మొత్తము కొరకు శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని యొక్క ఛార్జ్‌కు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతలు/గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

షెడ్యూలు-సి : ఆస్తి వివరణ (డాక్యుమెంట్ నెం. 4148 ఆఫ్ 2004) : రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు మరియు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా ఆదోని, మండిగిరి పంచాయితీ పరిధిలో పోస్టల్ కాలనీలో గల సర్వే నం. 192-L.P. No. 115/76 G.A.R. కాలనీలో నం. 36 (ఇంటి నం. 2/522) కలిగిన ఖాళీ ప్లాట్ యావత్తు. **సరిహద్దులు: తూర్పు:** కాలనీ రోడ్డు, **పశ్చిమం:** ప్లాట్ నం. 30 **ఉత్తరం:** ప్లాట్ నం. 35 **దక్షిణం:** ప్లాట్ నం. 37 **సైట్ కొలతలు: తూర్పు-పశ్చిమం:** 55 అడుగులు లేదా 16.76 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం:** 40 అడుగులు లేదా 12.19 మీటర్లు, 244.44 చ.గజాలు **ఇంటి కొలతలు: తూర్పు-పశ్చిమం:** 32 అడుగులు లేదా 9.75 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం:** $29^{1/2}$ అడుగులు లేదా 8.99 మీటర్లు. 944 చ.అడుగులు.

సం/- **అధీకృత అధికారి**